క్లుప్తంగా

జాతీయ మాస్టర్స్ అథ్లెట్లకు సన్మానం



బాపట్ల: బాపట్లకు చెందిన షేక్ నజీర్, షేక్ ఇమామ్ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో సత్తా చాటి పలు పతకాలు సాధించారని అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్.జిలాని తెలిపారు. క్రీడాకారులను శుక్రవారం అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా జిలాని మాట్లాడుతూ హరియాణ రాష్ట్రంలోని కురుక్షేత్రలో జరిగిన జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో నజీర్ 100 మీటర్ల పరుగు పందెంలో బ్రాంజ్ మెడల్, ఇమామ్ 4 ఇంటూ 400 మీటర్ల రిలే పరుగు పందెంలో సిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు. బాపట్లకు చెందిన మాస్టర్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి కరీమ్, జాని, జమ్రుద్ బాషా, ఆరిఫ్, ఆశిష్, షంషీ, మతపెద్దలు, అంజుమాన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పిడుగు పడి వరికుప్ప దగ్ధం



నిజాంపట్నం: పిడుగుపడి వరికుప్ప దగ్ధమైన సంఘటన పల్లపట్ల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నిజాంపట్నం మండలం పల్లపట్ల గ్రామంలో అంగిరేకుల రామకృష్ణకు చెందిన వరికుప్పపై శుక్రవారం ఉదయం పిడుగు పడి పూర్తిగా దగ్ధమైంది. హైమావతికి చెందిన 1.70 ఎకరాల వరి పొలాన్ని అంగిరేకుల రామకృష్ణ కౌలుకు వేశాడు. కోతలు కోసి నూర్పిళ్ల కోసం పొలంలోనే కుప్పను వేశాడు. ఈ క్రమంలో అకాల వర్షానికి పిడుగు పడి వరికుప్ప పూర్తిగా కాలి బూడిదైంది. సంఘటనా స్థలానికి స్థానికులు చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేదు. ఈ ప్రమాదంలో సుమారు లక్షా 50 వేలకు పైగా నష్టం వాటిల్లిందని స్థానికులు చెబుతున్నారు.

బుడా వైఎస్ చైర్మన్‌గా భానుప్రతాప్ నియామకం



బాపట్ల: బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా బాపట్ల మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల జిల్లా పరిధిలోని బాపట్ల, రేపల్లె, వేమూరు, గుంటూరు జిల్లా పరిధిలోని నందిపాడు, కాకుమాను కలిపి బుడాను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఇటీవల బుడా చైర్మన్‌గా మల్లికార్జునరావును నియమించగా వైస్ చైర్మన్‌గా బాపట్ల మున్సిపల్ కమిషనర్‌ను నియమించింది. మున్సిపాల్టీ అభివృద్ధిలో మంచి పట్టుకున్న కమిషనర్ భానుప్రతాప్‌కు ఈ అవకాశం కల్పించడంతో పట్టణాల అభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రమైన బాపట్లలో 20 ప్రధాన రహదారుల విస్తరణ చేపట్టి సుందరీకరణ చేయడంతో ఉత్తమ కమిషనర్ అవార్డును కూడా సొంతం చేసుకున్నారు.

మహిళకు సెల్‌ఫోన్ అప్పగింత



వేమూరు: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను శుక్రవారం పోలీసులు కనుగొని బాధిత మహిళకు అప్పగించారు. జంపని గ్రామానికి చెందిన మహిళ నెల రోజుల క్రితం గ్రామం నుంచి వేమూరుకు ఆటోలో వెళుతుండగా సెల్‌ఫోన్ పోయింది. దీనిపై బాధితురాలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ చోడయ్య కేసు నమోదు చేశారు. సెల్‌ఫోన్‌ను గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేశారు. తెనాలి సెల్ షాపులో సదరు సెల్‌ఫోన్‌ను కనుగొన్నారు. షాపు నిర్వాహకులను విచారణ చేయగా గుర్తుతెలియని వ్యక్తి షాపులో అమ్మితే కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఆ సెల్‌ఫోన్‌ను బాధితురాలికి అందజేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గురుకులానికి వేళాయె!

- ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 24 వరకు గడువు
- వచ్చే నెల 23వ తేదీ ప్రవేశ పరీక్ష
- సీటు సాధిస్తే మంచి భవిష్యత్తుకు పునాది



బాపట్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల

బాపట్ల అర్బన్: చదువుపై ఆసక్తి ఉన్నవారికి గురుకులాలు మంచి అవకాశంగా మారాయి. పేద, మధ్య తరగతి వర్గాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 2023-2024 విద్యా సంవత్సరానికి ఆంగ్ల మాధ్యమంలో చేరేందుకు సాంఘిక సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తుకు ఈ నెల 24వ తేదీ గడువు. వచ్చే నెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందులో ప్రవేశం దక్కితే ఇంటర్ వరకు ఉచితంగా చదువుకోవచ్చు. నీట్ ఐఐటీ ప్రవేశాలకు సిలబస్‌తో పాటు శిక్షణ ఇస్తారు.

బాపట్ల జిల్లాలో ఎక్కడెక్కడ అంటే..

బాపట్ల జిల్లాలో ఐదు ప్రాంతాల్లో గురుకుల కళాశాలలు ఉన్నాయి. బాలికలకు సంబంధించి బాపట్ల, రేపల్లె, పర్చూరు, యద్దనపూడి, నరసాయపాలెం, బాలురకు నిజాంపట్నం, చుండూరులో కళాశాలలు ఉన్నాయి. ఈ గురుకులాల్లో మొత్తం 5వ తరగతికి 80 సీట్లు, ఇంటర్మీడియెట్‌కు 80 సీట్లు ఉండగా, ఎస్సీలకు 60 సీట్లు, బీసీ-సీలకు 10 సీట్లు, ఎస్టీలకు 5 సీట్లు, బీసీలకు 4 సీట్లు, ఓసీలకు ఒక సీటు చొప్పున రిజర్వేషన్ ఉంటుంది.

అర్హతలివి..

- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 1-9-2010 నుంచి 31-8-2014 మధ్య జన్మించి ఉండాలి. మిగిలిన వారు 1-9-2012 నుంచి 31-8-2014 మధ్య జన్మించి ఉండాలి.
- 2021- 22 విద్యా సంవత్సరంలో మూడవ తరగతి 2022- 23లో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదువు పూర్తి చేసి ఉండాలి
- తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 2022 -23 నాటికి రూ.లక్షకు మించిఉండరాదు.

రిజర్వేషన్ వివరాలు..

ఎస్సీలకు 75 శాతం, బీసీ-సీ 12 శాతం, ఎస్సీ 6 శాతం, ఇతరులకు ఒక శాతం.

దరఖాస్తు విధానం

హెచ్‌టీటీఓఆర్//ఏపీఎఫ్‌పీసీఈటీ.ఏపీ.సీఎఫ్ఆర్ ఆర్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు. ఐదో తరగతిలో చేరే పాఠశాల, కళాశాల వివరాలు నమోదు చేయాలి. ఆన్‌లైన్‌లో నమోదు చేశాక పాఠశాలలు, కళాశాలల మార్పు కుదరదు.

ఎంపిక విధానం..

ప్రవేశ పరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ, సీటు కేటాయింపు ఉంటుంది.

ఇంటర్ ప్రవేశానికి అర్హతలు ఇవి..

- 2022- 23లో పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులు మాత్రమే అర్హులు.
- 31-8-23 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్ చదివిన వారికి ఏడాది మినహాయింపు ఉంటుంది.
- తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్షలోపు ఉండాలి.

ఎస్సీలకు 75 శాతం, కన్వర్టర్ క్రిస్టియన్ 12 శాతం, ఎస్టీలకు 6 శాతం, బీసీలకు ఐదు శాతం ఓసీలకు 2 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తారు.

ప్రవేశ పరీక్ష సిలబస్ ఇలా..

గణితంలో 25 ప్రశ్నలు, ఫిజికల్ సైన్స్ 15, బయాలజీ 15, సోషల్ 15, ఇంగ్లిష్ 15, లాజికల్ రీజనింగ్ 15 ప్రశ్నలు ఉంటాయి

పేద పిల్లలకు వరం



చదువుపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఇదో మంచి అవకాశం. ఐదో తరగతిలో చేరితే ఇంటర్ వరకు చదువుతో పాటు వసతి, అవసరమైన సదుపాయాలు ఉచితంగా అందుతాయి. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల శిక్షణ ఉంటుంది. ఉన్నత కోర్సుల్లో చేరేందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

కమ్మ భవానీదేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, బాపట్ల

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సేవలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బాపట్ల శాఖ కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాస్, పట్టణ సీఐ పి.కృష్ణయ్య, బ్యాంక్ జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్, డెప్యూటీ జోనల్ మేనేజర్ ఎ.రజనీ, బాపట్ల బ్రాంచ్ మేనేజర్ హరీష్ పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

మండల విద్యాశాఖాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు

పిట్టలవానిపాలెం: విద్యా ప్రమాణాల పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది వార్షిక తనిఖీలు నిర్వహించాల్సి ఉందని, అందులో భాగంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. హాజరు, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న గోరుముద్ద పథకం పనితీరును తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మెనూ అమలు చేయాలని తెలిపారు. ఆయన వెంట సీఆర్పీలు మునలయ్య, స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

పిట్టలవానిపాలెం: గోకరాజునల్లిబోయినవారిపాలెం గ్రామంలో శుక్రవారం పట్టాభిసీతారామస్వామి సమేత లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం వేదపండితులతో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక యాగశాలలో అర్చకులు పూజలు నిర్వహించారు. శనివారం విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం స్వామివారి విగ్రహాలకు జలాదివాసం, ధాన్యాదివాసం, క్షీరాదివాసం కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం ఉదయం 10:5 గంటలకు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ, అనంతరం జీవధ్వజ స్తంభం, విమాన గోపుర శిఖర, యంత్ర ప్రతిష్టా మహోత్సవాలు జరుగుతాయని తెలిపారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దబ్బుకూటి మాధవరావు, మాజీ సర్పంచ్ బత్తుల శ్రీనివాసరావు, గ్రామపెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వడ్డీ లేకుండా పన్ను చెల్లింపునకు అవకాశం

బాపట్ల: బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలం, నీటి పన్నులను వడ్డీ లేకుండా చెల్లించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. జీఓఎంఎస్ నంబరు 34 ప్రకారం 16 నుంచి 31వ తేదీ వరకు వడ్డీ లేకుండా పన్నులు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పురప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

డివిజన్ ఇంజినీర్ గాంధీ సంతాప సభ

వేమూరు: పంచాయతీరాజ్ డివిజన్ ఇంజినీర్ అమర్తపూడి గాంధీ అకాల మరణం తీరనిలోటని ఇన్‌చార్జి ఎంపీడీవో సునీత తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతాప సభలో పంచాయతీరాజ్ ఇంజినీర్ దున్నా మరియదాసు, గ్రామ సచివాలయం అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ఘనంగా హరిద్రశృంగార్చన



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసిఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడుతూ బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగపిల్లలకు త్వరగా పెళ్లి జరిగేందుకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

రైలు కింద పడి మహిళ మృతి



భట్టిప్రోలు: కొడుకు దగ్గరకు వెళుతున్నానని చెప్పిన ఓ ఒంటరి మహిళ రైలు కింద పడి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. భట్టిప్రోలు క్రీస్తుభవన్ సమీపంలో నివసిస్తున్న పఠాన్ బాజి మున్నీసా (56) సమీపంలోని రైస్‌మిల్లులో కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఎర్రబాలెంలో ఉంటున్న కొడుకు ఇంటికి గురువారం రాత్రి రేపల్లె- సికింద్రాబాద్ రైలుకు వెళుతున్నానని ఇంటి సమీపంలో ఉండే వారికి చెప్పి వెళ్లింది. స్టేషన్‌కు వెళ్లకుండా భట్టిప్రోలు రైల్వే గేట్‌కు కూతవేటు దూరంలో రేపల్లె నుంచి వచ్చే రైలుకు ఎదురుగా నిలబడి ఆత్మహత్య చేసుకుంది. దీంతో ఆ రైలు, గేటు వద్ద దాదాపు పావుగంట సేపు ఆగింది. శుక్రవారం రేపల్లె రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వేణు, సిబ్బంది సంఘటనా స్థలానికి విచ్చేసి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తెనాలి వైద్యశాలకు తరలించారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు పఠాన్ సుభాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెనాలి రైల్వే ఎస్ఐ ఎల్.సరస్వతి తెలిపారు.

స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె: స్కీం వర్కర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యుడు నాగాంజనేయులు అన్నారు. సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం రేపల్లె పోలీస్ స్టేషన్ ఎదుట అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం తదితర స్కీం కార్మికులు ధర్నా నిర్వహించారు.

అకాల వర్షంతో అపార నష్టం



కొల్లూరు సమీపంలో వర్షానికి తడిసి ముద్దయిన పచ్చి ఇటుకలు



జాతీయ రహదారి సంతబజారులో నిలిచిన వర్షపునీరు



రేపల్లె పట్టణంలోని పద్మావతి థియేటర్ సెంటరులో నిలిచిన వర్షపునీరు

కొల్లూరు: అకాల వర్షం అన్నదాతలతో పాటు ఇటుక ఉత్పత్తిదారులకు అపార నష్టాన్ని కలుగజేసింది. శుక్రవారం కురిసిన వర్షానికి కల్లాల్లో ఆరబెట్టిన ఉడకబెట్టిన పసుపు కొమ్ములు, ఇటుక బట్టీలలోని పచ్చి ఇటుక తడిచి ముద్దవడంతో రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. వీటితో పాటు సాగులో ఉన్న మొక్కజొన్న, జొన్న పంటలు వర్షం కారణంగా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి. కొల్లూరు మండలంలో కురిసిన భారీ వర్షం కారణంగా లంక గ్రామాల్లో పసుపు సాగు చేసిన రైతులు నష్టానికి గురయ్యారు. ఆరబెట్టిన ఉడకబెట్టిన పసుపు వర్షానికి తడవడంతో రంగుమారి ధర తగ్గిపోతుందన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. మండలంలో సుమారు 2 వేల ఎకరాల్లో పసుపు సాగు చేయగా, ప్రస్తుతం రైతులు పసుపు ఉడకపెట్టి ఆరపెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలోని కొల్లూరు, పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక, పోతార్లంక, తోకలవారిపాలెం, తిప్పలకట్ట, దోనేపూడి గ్రామాల పరిధిలో ఉన్న ఇటుక పరిశ్రమపై వర్షం ప్రభావం తీవ్రంగా పడింది. సుమారు 50 లక్షల వరకు పచ్చి ఇటుక వర్షానికి తడిసి ముద్దవ్వడంతో రూ.కోట్లలో నష్టం వాటిల్లిందని ఇటుక ఉత్పత్తిదారులు వాపోతున్నారు. లేత దశలో ఉన్న జొన్న, మొక్కజొన్న పంటలు సైతం అకాల వర్షం కారణంగా దెబ్బతిని దిగుబడులు తగ్గుతాయన్న ఆవేదనలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలుండటంతో నష్ట తీవ్రత పెరుగుతుందన్న ఆందోళన రైతులు, ఇటుక ఉత్పత్తిదారుల్లో వ్యక్తమవుతోంది.

భట్టిప్రోలులో భారీ వర్షం

భట్టిప్రోలు: భట్టిప్రోలులో తెల్లవారుజామున తేలికపాటి వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వర్షం పడుతూ, ఆగుతూ భారీ వర్షం కురిసింది. మెట్ట ప్రాంతాల్లోని వాణిజ్య పంటలకు ఈ వర్షం లాభం చేకూర్చగా, మాగాణిలో వేసిన రబీలో మొక్కజొన్నకు తీరని నష్టం వాటిల్లే ప్రమాదం నెలకొంది. ఇప్పటికే పంటపై ఎకరాకు రూ.20 నుంచి రూ.30 వేల మధ్య ఖర్చుపెట్టారు. ఖరీఫ్, రబీలో అకాల వర్షాలు రైతన్నల నడ్డి విరిచాయి. ఉదయం నుంచి కరెంట్ వస్తూ పోతుండటంతో ప్రజలు ఒకింత అసహనానికి లోనయ్యారు. లంక గ్రామాలైన చింతమోటు, పెదలంక, పెసర్లంక గ్రామాల్లో కల్లాలో ఆరబోసిన పసుపు దిగుబడులను కాపాడుకునేందుకు రైతులు పట్టాలు కప్పారు. కల్లాల్లో ఆరబోసిన పసుపు తడిసిపోయాయి. ప్రస్తుతం మినుము, పెసర పంట చేతికి వచ్చాయని, ఈ తరుణంలో వర్షం కురియడంతో రైతులు కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి.

అన్నదాత అతలాకుతలం

పిట్టలవానిపాలెం: మండలంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి కురిసిన అకాల వర్షానికి రబీలో సాగు చేసిన మినుము, పెసర రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట చేతికొచ్చిందనుకుంటున్న తరుణంలో కురిసిన వర్షంతో అన్నదాతను అతలాకుతలం చేసింది. పిట్టలవానిపాలెం మండలంలోని గోకరాజునల్లిబోయినవారిపాలెం, ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం, పోతనకట్టవారిపాలెం, అల్లూరు, అలకాపురం గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల్లో మినుము, పెసర పంటలను సాగు చేశారు. అయితే గత వారం రోజుల నుంచి పైరును కోత కోసి నూర్పిళ్లకు సిద్ధం చేశారు. అకాల వర్షంతో మినుము, పెసర ఓదెలపై వర్షపు నీరు నిలిచింది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. నీట మునిగిన మినుము, పెసర ఓదెలను వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

చెరుకుపల్లిలో..

చెరుకుపల్లి: అల్పపీడన ద్రోణితో కురిసిన వర్షంతో శుక్రవారం 216-ఏ జాతీయ రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉరుములు, మెరుపులతో ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, స్కూల్ బస్సులు, ఇంటర్ పరీక్షకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జాతీయ రహదారి సంతబజారులో నిలిచిన వర్షపునీటితో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ అధికారులు రహదారిపై నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

వర్షంతో రహదారులు జలమయం

రేపల్లె రూరల్: వర్షంతో పట్టణ, మండలంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. పట్టణంలోని పద్మావతి థియేటర్ సెంటరు, మున్సిపల్ ఆఫీసు రోడ్డు, గరువురోడ్డు, నిజాంపట్నం రోడ్డు, ఇందిరానగర్ కాలనీలతో పాటు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ చేరింది. మొక్కజొన్న పంటకు కొంత ప్రయోజనం ఉన్నా మినుము, పెసర పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జూనియర్ ఇంటర్ ఇంగ్లిష్ పరీక్షకు 21 మంది గైర్హాజరు



చెరుకుపల్లి: జూనియర్ ఇంటర్ ఇంగ్లిష్ పరీక్షకు రెండు పరీక్షా కేంద్రాల్లో 21 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎగ్జామ్ సూపరింటెండెంట్‌లు వి.రామచంద్రరావు, వై.దాసు తెలిపారు. శుక్రవారం జరిగిన మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 340 మంది విద్యార్థులకుగాను 8 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా, 332 మంది హాజరయ్యారు. పొన్నపల్లి గీతం కళాశాలలో 352 మందికిగాను 13 మంది గైర్హాజరుకాగా, 339 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.